




# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








| సోమవారం 09 మార్చి 2026 | పేజీలు 04 | వెల - 2/- | సంపుటి 01 సంచిక 280 | ప్రచురణ - తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత |
|---|---|---|---|---|---|




## మహిళలతోనే సమాజ అభివృద్ధి : ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 09: మహిళలకు అవకాశం ఇస్తే అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారని, మహిళలతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆదివాసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్కతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ భవన్‌లో ఏర్పాటు చేసిన డయాగ్నస్టిక్, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, ఫీడింగ్ కియోస్క్ స్టాళ్లను మంత్రులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అక్కడున్న మహిళలు, బాలికలతో ముచ్చటించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం మహిళల ఆరోగ్య పరీక్షలు, క్యాన్సర్ టీకాలపై రూపొందించిన వీడియోలను ప్రదర్శించారు. ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో నివసించే మహిళల భద్రత, వసతి కోసం రూపొందించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్‌ను, సెర్ప్ సంస్థ గత ఏడాది సాధించిన విజయాలపై రూపొందించిన పుస్తకాన్ని మంత్రులు ఆవిష్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా సంఘాల సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ మహిళా సాధికారత దేశ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం కోసం ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమం అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా సంఘాలకు రికార్డు స్థాయిలో రుణాలు మంజూరు చేసి సుమారు 1,200 కోట్ల రూపాయల వడ్డీ రాయితీ అందించామని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు డ్వాక్రా మహిళల కోసం ఉచిత ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని సుమారు 46 లక్షల మహిళలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. సెర్ప్ సహకారంతో మహిళలను సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లి రక్తపోటు, చక్కెర, థైరాయిడ్ తదితర 30 రకాల కీలక పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షల అనంతరం ప్రతి మహిళకు క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ ఆరోగ్య రికార్డు సృష్టించి సంబంధిత పోర్టల్‌లో భద్రపరుస్తామని వివరించారు. దేశంలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ తర్వాత ఎక్కువగా కనిపిస్తున్న సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని మంత్రి తెలిపారు. తెలంగాణలో ప్రతి సంవత్సరం సుమారు 3,200 సర్వైకల్ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. 14 ఏళ్లు నిండిన సుమారు 4 లక్షల బాలికలకు ఈ టీకాను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. మార్కెట్లో మూడు వేల నుంచి నాలుగు వేల రూపాయల విలువ చేసే ఈ టీకాను కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్య భవిష్యత్తు దృష్ట్యా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు ఆరోగ్యంగా, ఆర్థికంగా బలంగా ఉన్నప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ సంగీత సత్యనారాయణ, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.



## కృష్ణా జలాలను సమర్థంగా వినియోగిస్తాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 09: తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కృష్ణా జలాలను సమర్థవంతంగా వినియోగించి ఉమ్మడి మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో ఉన్న ప్రాజెక్టుల పనులపై సమీక్ష నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ ఖరీఫ్ పంట సీజన్‌లో అత్యధికంగా వరి సాగు నమోదైందని, కృష్ణా మరియు గోదావరి బేసిన్ ప్రాంతాల్లో విస్తృతంగా సాగు పంటలు పండుతున్నాయని తెలిపారు. నీటిపారుదల రంగంలో అన్ని ప్రాజెక్టుల పనులను వేగవంతంగా పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణను జూన్ 2 లోపు ఐదు వేల కోట్ల రూపాయల వ్యయంతో పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిధుల అంశంపై కూడా చర్చించామని, గత పాలకులు పాలమూరు ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 55 వేల కోట్ల రూపాయల అంచనాతో ఉన్న ప్రాజెక్టులో 27 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా నీరు అందలేదని అన్నారు. వారి పాలనలోనే ప్రాజెక్టు అంచనాలను 84 వేల కోట్లకు పెంచారని తెలిపారు. పాలమూరు ప్రాజెక్టును జూరాల నుంచి శ్రీశైలంకు మార్చడం వల్ల ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. అన్ని ప్రాజెక్టు పనులను 2028 డిసెంబర్ లోపు పూర్తి చేస్తామని, నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేసి పనులను వేగంగా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.



## గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 09: బదిలీపై వెళ్లనున్న తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌గా రాష్ట్రానికి అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పాలనలో గవర్నర్ అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. అనంతరం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తు బాధ్యతల్లో కూడా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




## మహిళా సంఘాల సభ్యులకు 30 రకాల ఆరోగ్య పరీక్షల కేంద్రం ప్రారంభం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 09: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ భవన్‌లో మహిళా సంఘాల సభ్యుల కోసం ఏర్పాటు చేసిన 30 రకాల ఆరోగ్య పరీక్షల కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంత్రి సీతక్కతో కలిసి ప్రారంభించారు. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రక్తపోటు, చక్కెర, థైరాయిడ్ తదితర ముఖ్య పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు.

## రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉత్సాహంగా జరిగిన మహిళా దినోత్సవ వేడుకలు




సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 09: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజా భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, కన్నుల పండుగలా జరిగాయి. రాష్ట్ర సమాచార ప్రజాసంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అటవీ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రముఖ వార్తాపత్రికలు, వార్తా ప్రసార సంస్థలకు చెందిన మహిళా పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మీడియా అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సమాచార ప్రజాసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. మహిళా పాత్రికేయుల వృత్తికి సంబంధించిన పలు పోటీలను కూడా నిర్వహించగా వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ తన రాజకీయ ప్రయాణంలో అనేక మంది మహిళా పాత్రికేయులు శ్రేయోభిలాషులుగా ఉన్నారని, మహిళల మాటలకు విశ్వసనీయత ఎక్కువగా ఉంటుందని అన్నారు. త్వరలో కళాశాల విద్యార్థినులకు విద్యుత్ వాహనాలు అందజేయనున్నట్లు ప్రకటించారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందుతున్న తప్పుడు వార్తలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, మహమ్మద్ అజారుద్దీన్ మహిళా పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. తరువాత శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా బజార్‌ను మహిళా పాత్రికేయులు సందర్శించి స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేసి వారికి ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడి ప్రభుత్వ ప్రోత్సాహకాలు, మార్కెటింగ్ అవకాశాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఉప ప్రధాన నిర్వాహక అధికారి టి. కామేశ్వరరావు, జనని, రాజేష్ సిన్హా, కిరణ్ సాయి కుమార్, రజనీష్ పాండే తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా పాల్గొన్న మహిళా పాత్రికేయులు తమ సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా మహిళా రైతు మహా మేళా - ఆరు వేల మహిళా రైతుల హాజరు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 09: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న మహిళా రైతు మహా మేళా ఘనంగా ప్రారంభమైంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరాన్ని మహిళా రైతుల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ మేళాను ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖలు మరియు కోరమాండల్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, మహిళా రైతులు, వ్యవసాయ నిపుణులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతాంగ సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. సుమారు ఇరవై ఐదు లక్షల మంది రైతులకు దాదాపు ఇరవై ఒక వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో నిలిచిపోయిన రాయితీ విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాలను తిరిగి ప్రారంభించామని చెప్పారు. ఐదు వందల కోట్ల రూపాయల వ్యయంతో పునరుద్ధరించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో మహిళా రైతులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, భవిష్యత్తులో మహిళలకు వ్యవసాయ వినియోగం కోసం గగన యంత్రాలను అందిస్తామని తెలిపారు. పంట మార్పిడి విధానాలు, సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తున్నామని, ప్రతి జిల్లాలో తాటి నూనె పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఆధునిక నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజల అవసరాలకు సరిపడా ఆహార ధాన్యాలను రైతులు పండించాలని పిలుపునిచ్చారు. భూసార పరిరక్షణ, పంటల వైవిధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆహార ఉత్పత్తిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని, వ్యవసాయంలో అరవై నుంచి ఎనభై శాతం వరకు మహిళలే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ప్రధానాధికారి జాట్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతాంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని ప్రశంసించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి జానయ్య మాట్లాడుతూ మహిళా రైతుల సాధికారత కోసం ఈ మహా మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ముప్పై మంది మహిళా రైతులకు, ఆరుగురు వ్యవసాయ పాత్రికేయులకు మంత్రులు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి, ఉద్యాన శాఖ సంచాలకులు యాస్మీన్ బాషా, శాసన మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ శాసన సభ్యుడు ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 30 నెలల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 2027 మార్చి నాటికి కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ పూర్తి చేస్తాం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 09: రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి దక్షిణ తెలంగాణ రైతాంగానికి సమృద్ధిగా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పురోగతిపై సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ముప్పై నెలల్లో పూర్తి చేస్తామని, అలాగే 2027 మార్చి నాటికి కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని, కల్వకుర్తి ప్రాజెక్టుకు 909 కోట్లు, నెట్టెంపాడుకు 252 కోట్లు, భీమా ప్రాజెక్టుకు 200 కోట్లు, కోయిల్ సాగర్ ప్రాజెక్టుకు 185 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ మరియు పునరావాస పనుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 2 నాటికి ఐదు వేల కోట్ల రూపాయలు విడుదల చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. గతంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ఆఫ్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల ఖర్చులు పెరిగి రాష్ట్రానికి నష్టం జరిగిందని ఆయన విమర్శించారు. ఇదే విధంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చడం వల్ల తెలంగాణ రైతులకు అన్యాయం జరిగిందన్నారు. రైతులకు వాగ్దానం చేసిన సాగునీటి ప్రయోజనాలను అందించేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని, అన్ని చర్యలు చట్టబద్ధంగా పారదర్శకంగా ఉంటాయని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు గతంలో 35,200 కోట్ల రూపాయల పరిపాలన అనుమతి ఇచ్చినా సుమారు 27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి పనులు పూర్తి చేయలేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం సవరించిన అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు 55 వేల కోట్ల రూపాయలుగా ఉండగా పంపిణీ కాలువల నిర్మాణంతో కలిపి మొత్తం వ్యయం 80 వేల కోట్ల రూపాయల వరకు పెరిగే అవకాశముందని తెలిపారు. అయినప్పటికీ ఈ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు నీరు అందిస్తామని స్పష్టం చేశారు. 2023 డిసెంబర్ 7 నుంచి ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై 7161 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఇందులో ప్రాజెక్టు పనులకు 6718 కోట్లు, భూసేకరణకు 284.71 కోట్లు, పునరావాసానికి 63.65 కోట్లు, ఇతర ఖర్చులకు 94 కోట్లు వినియోగించినట్లు వివరించారు. అలాగే జూరాల ప్రాజెక్టులో వెంటనే మట్టి తొలగింపు పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు రూపకల్పన సమయంలో 11.94 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉండగా మట్టి పేరుకుపోవడం వల్ల ప్రస్తుతం సుమారు 9 టీఎంసీలకు తగ్గిందని తెలిపారు. తెలంగాణకు కృష్ణా నదిపై ఉన్న హక్కులను పూర్తిగా వినియోగించుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. గత ఖరీఫ్ సీజన్‌లో 148.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి నమోదైందని, కనీస మద్దతు ధర కింద సుమారు 72 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో దాదాపు 20 వేల కోట్ల రూపాయలు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్య దాస్ నాథ్, ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్ మరియు శాఖ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# భవిష్యత్‌కు సిద్ధమైన పోలీసింగ్‌లో తెలంగాణ ఆదర్శం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

### సైబర్ నేరాల పెరుగుదలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు మంత్రి సూచన






సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 09: భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే పోలీసింగ్ వ్యవస్థను నిర్మించి తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలపడం తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సమాచార సాంకేతిక మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీసు అకాడమీలో పోలీసు ఉన్నతాధికారుల కోసం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు సాంకేతికత, ప్రజల విశ్వాసం, ప్రతిభ అనే మూడు అంశాలపై ఆధారపడిన వ్యూహంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఒకప్పుడు పోలీసింగ్ అంటే కేవలం శాంతి భద్రతల పరిరక్షణ మాత్రమే ఉండేదని, ఇప్పుడు సమాచార భద్రత మరియు డిజిటల్ నమ్మకాన్ని కాపాడే దిశగా విస్తరించిందని చెప్పారు. కాలానుగుణంగా నేరాలు కూడా భౌతిక సరిహద్దులను దాటి డిజిటల్ రూపంలో విస్తరించాయని పేర్కొన్నారు. నకిలీ దృశ్యాలు, స్వర అనుకరణ, మోసపూరిత సందేశాలు వంటి కొత్త తరహా సైబర్ నేరాలు పోలీసులకు సవాల్‌గా మారాయని తెలిపారు. ప్రస్తుతం నేరగాళ్లు ఆయుధాల కంటే మొబైల్ ఫోన్లు, సమాచార వివరాలు, డిజిటల్ గుర్తింపులను ఉపయోగించి నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా సైబర్ నేరాల వల్ల భారీ మొత్తంలో డబ్బు మోసపోయినట్లు వెల్లడించారు. ఇలాంటి పరిస్థితుల్లో వృత్తి నైపుణ్యం, కార్యాచరణ సిద్ధత, నాయకత్వం, ఆవిష్కరణ, సమన్వయం మరియు నైతిక విలువలతో కూడిన భవిష్యత్‌కు సిద్ధమైన పోలీసింగ్ అవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌లో తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆధునిక సమాచార విశ్లేషణ పద్ధతులు, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాలు జరగకముందే అడ్డుకునే విధానానికి ప్రాధాన్యం ఇవ్వనున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాల సాధనలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజల విశ్వాసాన్ని పొందినప్పుడే నిజమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నక్సలిజం వ్యతిరేక పోరాటంలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులను ఈ సందర్భంగా మంత్రి స్మరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు ప్రధాన అధికారి శివధర్ రెడ్డి, సైబర్ భద్రతా విభాగం అధికారి శిఖా గోయల్, పోలీసు అకాడమీ అధిపతి అభిలాష్ బిష్త్, మాజీ పోలీసు ప్రధానాధికారులు హెచ్.జే. దొర, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు లోక్ భవన్‌లో ఘన వీడ్కోలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 09: మహారాష్ట్ర గవర్నర్‌గా కొత్త బాధ్యతలు స్వీకరించనున్న తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు లోక్ భవన్‌లో అధికారులు, సిబ్బంది హృదయపూర్వకంగా వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అక్కడ పనిచేస్తున్న ప్రతి అధికారి, సిబ్బందిని వ్యక్తిగతంగా కలుసుకుని తన పదవీకాలంలో అందించిన సహకారం, మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. తన పదవీకాలంలో అందరి సహకారంతో రాష్ట్రానికి సేవ చేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తు బాధ్యతల్లో కూడా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయన సేవాభావం, నిబద్ధతను ఈ సందర్భంగా అధికారులు స్మరించుకున్నారు.

## రాష్ట్ర సచివాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 09: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సచివాలయ మహిళా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పలువురు భారత పరిపాలనా సేవాధికారులు, సచివాలయ మహిళా ఉన్నతాధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు, చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మహిళల పాత్ర, వారి సాధికారతపై పలువురు అధికారులు అభినందనలు తెలియజేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.




## సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి టీకా కీలకం: కలెక్టర్ పి. ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 9 (టి. సంగమేశ్వర్): మహిళల్లో పెరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్ నివారణలో హెచ్‌పివి టీకా కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. ఆదివారం సంగారెడ్డి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో హెచ్‌పివి టీకాల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. జిల్లాలో 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల సుమారు 12,500 మంది బాలికలను గుర్తించి ప్రజా పాలన–ప్రగతి కార్యక్రమంలో భాగంగా 99 రోజుల వ్యవధిలో సాధారణ మరియు ప్రాంతీయ ఆసుపత్రుల ద్వారా ఉచితంగా టీకాలు అందించనున్నట్లు తెలిపారు. బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రుల సమక్షంలోనే టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు సహా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: యువజన కాంగ్రెస్ నాయకుడు అరవింద్

వట్పల్లి , మార్చి 9( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్)వట్పల్లి మండల్ బిజిలిపూర్ గ్రామం లో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి మంచి భవిష్యత్తు సాధించాలని యువజన కాంగ్రెస్ మండల నాయకుడు అరవింద్ సూచించారు. ఆదివారం బిజిలీపూర్ ప్రాథమిక పాఠశాలలో 33 మంది విద్యార్థులకు ఉచితంగా టీషర్టులను పంపిణీ చేశారు. ఇటీవల పాఠశాల విద్యార్థుల క్రీడా ఆసక్తిని వారి తల్లిదండ్రులు తన దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. “ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి క్రీడలు ఎంతో అవసరం. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంచుతాయి. క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ గ్రామానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి” అని అరవింద్ పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఉచితంగా టీషర్టులు అందజేయడంతో విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆరగొండ సంగప్ప, వార్డు సభ్యులు రాయికోటి మల్లేశం, తలారి రజినీకాంత్, యువ నాయకులు శంకర్, శ్రీనివాస్, కుమార్, నర్సింలు, దొడ్ల అనిల్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు సమాజానికి ఆధారస్తంభాలు ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు



వట్పల్లి మర్చి, 9( సందేశం టైం సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండల్ మేడుకుంద గ్రామం లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు కచూర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “కార్యేషు దాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాత అనేలా ప్రతి పాత్రలోనూ మహిళలు సమాజానికి ఆధారస్తంభాలుగా నిలుస్తున్నారు. కుటుంబం నుంచి సమాజ అభివృద్ధి వరకు మహిళల పాత్ర అపారమైనది. ఈ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి మాతృమూర్తికి వందనాలు తెలియజేస్తూ, వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని, దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను” అని పేర్కొన్నారు. – కచూర్ రావు, మేడికుంద

## మహిళా పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం



జహీరాబాద్, మార్చి 9( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్ ) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం (SGTU) జహీరాబాద్ జోన్ ఆధ్వర్యంలో మహిళా పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా SGTU జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాల పిల్లలు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. పారిశుద్ధ్య కార్మికులకు గౌరవ వేతనం నిర్ణయించి చెల్లించాలని, మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలను అరికట్టుతూ నిర్భయ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళలు తమ హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయాల్సి వస్తోందని అన్నారు. కార్యక్రమంలో SC, ST ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు దేవి సింగ్, టీబేస్ నాయకుడు జైసింగ్, SGTU జహీరాబాద్ మండల గౌరవ అధ్యక్షుడు డా. శివశేఖర్, అధ్యక్షుడు విశ్వనాథ్, ఉపాధ్యక్షుడు విజయ్, కోశాధికారి రాజేంద్రప్రసాద్, జహీరాబాద్ టౌన్ అధ్యక్షుడు మొహమ్మద్ షెకీల్, మొగుడంపల్లి అధ్యక్షుడు బానోత్ కిషన్, న్యాల్కల్ మండల గౌరవ అధ్యక్షుడు కే. కిష్టయ్య, షకీల్ హైమాద్ కంప్యూటర్ ఆపరేటర్ తదితరులు పాల్గొన్నారు.

## బోరంచ నల్లపోచమ్మ తల్లి దేవాలయానికి మహా హుండీ బహుకరణ





మనూర్, మార్చి 9( సందేశం టైమ్స్ నారాయణఖేడ్ నియోజకవర్గం ఇన్చార్జి టి చంద్రశేఖర్ ) సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం బోరంచ గ్రామంలో మంజీరా నది ఒడ్డున స్వయంభూ గా కొలువుదీరిన శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ తల్లి దేవాలయానికి తుమ్నూర్ గ్రామానికి చెందిన దాతలు మంగలి నారాయణ, మంగలి యాదగిరి, మంగలి మహేష్‌లు సుమారు రూ.65 వేల విలువైన మహా హుండీని బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మల్లయ్య దాతలను శాలువాతో సన్మానించారు. దాతల కుటుంబాలకు అమ్మవారి ఆశీర్వాదాలు కలగాలని ఆలయ అర్చకులు సిద్ధయ్య స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ క్లర్క్ శివానంద్, అర్చకులు నాగయ్య స్వామి, ప్రవీణ్ స్వామి, ఆలయ సిబ్బంది శేఖర్, సందీప్‌తో పాటు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా భక్తులు, దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## సామాజిక సేవలో ముందుండే వై. పండరికి ఘనంగా జన్మదిన వేడుకలు



నారాయణఖేడ్, మార్చి 9( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్ )సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ భవనంలో ప్రజాసంఘాల సమక్షంలో నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్, సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాగల్గిద్ద మండలం ఆవుత్‌పూర్ గ్రామానికి చెందిన వై. పండరితో ప్రజాసంఘాల నాయకులు, అంబేద్కర్ అభిమానులు కలిసి కేక్ కట్ చేయించి శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ భవిష్యత్తులో మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొతారి నర్సింలు, మాల మహానాడు నారాయణ అధ్యక్షులు విశ్వనాథం, అంబేద్కర్ భవనం ఇన్‌చార్జ్ భీమ్సేనే, అంబేద్కర్ సంఘం నాయకులు అర్జున్, బీఎస్పీ తాలూకా ఇన్‌చార్జ్ పండరి నారాయణతో పాటు పలువురు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అవుత్‌పూర్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

నారాయణఖేడ్, మార్చి 9( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్ ) సంగారెడ్డి జిల్లా నాగల్గిద్ద మండలం అవుత్‌పూర్ గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్ అండ్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళల సాధికారత, సమాజ అభివృద్ధిలో వారి పాత్రను గుర్తు చేస్తూ పలువురు మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళా సమాఖ్య కార్యదర్శి వై. విమల, 10వ వార్డు సభ్యురాలు బి. అక్షిత, గ్రామ సీనియర్ మహిళలు నర్సమ్మ, ఈరమ్మలకు శాలువాలు కప్పి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల ప్రగతితోనే సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యుస్సుబ్, రాజు స్వామి, సుందర్, మహిళా సమాఖ్య వీఓఏ జీతప్ప, గ్రామ పంచాయతీ కార్మికుడు గణపతి తో పాటు గ్రామానికి చెందిన మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళా కౌన్సిలర్లు, వైద్య సిబ్బందికి ఘన సన్మానం మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి వైస్ చైర్మన్ చిట్టి బాబు ఆధ్వర్యంలో





అందోల్ మర్చి 9( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండల్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి మహిళా కౌన్సిలర్లు, ప్రభుత్వ ఆసుపత్రి మహిళా వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు పురపాలక శాఖ ఆధ్వర్యంలో మహిళా కౌన్సిలర్లకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. “మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి సేవలు ప్రతి రంగంలో ప్రేరణగా నిలుస్తున్నాయి” అని వారు పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందిస్తున్న మహిళా డాక్టర్లు, నర్సులను కూడా శాలువాలు కప్పి స్మారక చిహ్నాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమం ముగింపులో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# మహిళలతోనే సమాజ అభివృద్ధి మంత్రి దామోదర్ రాజనర్సింహ


సంగారెడ్డి, మార్చి 9 (సందేశం టైమ్స్ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి కే సంగమేశ్వర్ ) మహిళలకు అవకాశాలు కల్పిస్తే వారు అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆదివాసీ భవన్‌లో మంత్రి సీతక్కతో కలిసి జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని డ్వాక్రా మహిళల హెల్త్ ప్రొఫైలింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డయాగ్నస్టిక్, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, ఫీడింగ్ కియోస్క్ స్టాల్లను ప్రారంభించి వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని సుమారు 46 లక్షల మంది మహిళలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం 14 ఏళ్లు నిండిన సుమారు నాలుగు లక్షల బాలికలకు మార్కెట్లో రూ.3 వేల నుంచి రూ.4 వేల విలువ చేసే గార్డాసిల్-4 హెచ్‌పీవీ టీకాను ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి ఎల్ఓసీ అందజేసిన ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 9 (టి. సంగమేశ్వర్): జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలం ముంగి గ్రామానికి చెందిన శంభోనోలా శ్రీనివాస్ రెడ్డికి అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఒక లక్ష డెబ్బై ఐదు వేల రూపాయల ఎల్ఓసీని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ శెట్కార్ అందజేశారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో ముంగి గ్రామ సర్పంచ్ అరుణ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులు ఎల్ఓసీని స్వీకరించి కృతజ్ఞతలు తెలిపారు. అవసర సమయంలో సహాయం అందించినందుకు ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్‌కు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రపంచ కప్ గెలిచిన భారత్ న్యూజిలాండ్‌పై ఘన విజయం



సందేశం టైమ్స్, అహ్మదాబాద్, మార్చి 09: ఐసీసీ పురుషుల టి20 ప్రపంచకప్-2026 ఫైనల్ పోటీలో భారత జట్టు న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించి ప్రపంచ విజేతగా నిలిచింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ ముందుగా బౌలింగ్ ఎంచుకోగా, ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసి ప్రపంచకప్ ఫైనల్ చరిత్రలోనే భారీ స్కోరు నమోదు చేసింది. భారత బ్యాటర్లలో సంజూ శాంసన్ 46 బంతుల్లో 89 పరుగులు, అభిషేక్ శర్మ 52 పరుగులు, ఇషాన్ కిషన్ వేగంగా 54 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించారు. అనంతరం 256 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ జట్టు భారత బౌలర్ల ధాటికి నిలవలేక 19 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది. న్యూజిలాండ్ తరఫున టిమ్ సీఫర్ట్ 52 పరుగులు, మిచెల్ సాంట్నర్ 43 పరుగులు చేసినప్పటికీ జట్టును గెలిపించలేకపోయారు. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా 4 వికెట్లు, అక్షర్ పటేల్ కీలక వికెట్లు తీసి జట్టుకు విజయం అందించారు. ఈ విజయంతో భారత్ 96 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించి మూడోసారి టి20 ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకుంది.



# మహిళల సాధికారతకు కృషి కొనసాగాలి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

సందేశం టైమ్స్ మర్చి 9అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ జాగృతి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ, "మహిళలు సమాజ అభివృద్ధికి పునాది వంటివారు. ప్రతి రంగంలో మహిళలు ముందుకు రావాలని, సాధికారత కోసం అందరూ కలిసి కృషి చేయాలి" అని పేర్కొన్నారు. మహిళల ప్రతిభను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పిస్తే వారు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని ఆమె అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొని మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



# బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు పునరుద్ధరణ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 9 : హైదరాబాద్ మూసీ నది తీర అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నది పరివాహక ప్రాంతాన్ని రాత్రి ఆర్థిక కార్యకలాపాలు కొనసాగే విధంగా అభివృద్ధి చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శివరాంపల్లిలో పునరుద్ధరించి అందంగా తీర్చిదిద్దిన బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ, అనిల్ కుమార్ యాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజలకు మంచి వాతావరణం కల్పించేందుకు చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని తెలిపారు. చెరువుల వద్ద రాత్రి ఆర్థిక కార్యకలాపాలు జరిగేలా దుకాణాల ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పాలు, పండ్లు, కూరగాయలు వంటి వస్తువులను పరిశుభ్రమైన వాతావరణంలో విక్రయించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. మహిళలు ఉదయం, సాయంత్రం వేళల్లో సురక్షితంగా నడకకు వెళ్లేందుకు చెరువు వద్ద ప్రత్యేక భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్ నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఒకప్పుడు రాళ్లు, చెరువులతో ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ నగరాన్ని మళ్లీ పూర్వ వైభవంతో తీర్చిదిద్దేందుకు ఆక్రమణలకు గురైన చెరువులు, కాలువలను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పాత నగరాన్ని అసలు నగరంగా అభివృద్ధి చేయడానికి అనేక ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇటీవల కొత్వాల్ గూడ పరిసరాల్లో పర్యావరణ ఉద్యానవనాన్ని ప్రారంభించామని, త్వరలోనే మెట్రో రైలు విస్తరణ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. మీరాలం చెరువు వంతెన పనులు ప్రారంభమయ్యాయని, సమీపంలోనే ఉన్నత న్యాయస్థానానికి కొత్త భవనం నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని వివరించారు. హైదరాబాద్ నగరం పురాతనమైన, ప్రాముఖ్యత కలిగిన నగరమని, దాని ప్రాభవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. బతుకమ్మ కుంటను కూడా అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ నగర అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రజలు ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / యజమాని / సంపాదకురాలు: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.